

వర్షం తెచ్చిన తంట

నగరంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాలు ఆగమాగమయ్యాయి. శుక్రవారం కూడా వరద కొనసాగింది. రోడ్లపై మురుగునీరు పారింది. రహదారులు గుంతలమయంగా మారాయి.


అమీర్‌పేటలో బురదను తుడుచుకుంటున్న దుకాణదారులు..

వీడని వరద కష్టాలు

• లోతట్టు ప్రాంతాలు జలమయం • రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు

బాలానగర్/ఓల్డుబోయినపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా బాలానగర్, ఓల్డుబోయినపల్లికి చెందిన లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై వర్షం నీరు ఏరులై పారుతుండడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది స్పందించి మ్యాన్ హోల్ పై కప్పులను తొలగించి వర్షం నీటిని దారి మళ్లించారు. పలుచోట్ల స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆయా డివిజన్ల అధికారులు సిబ్బందితో కలిసి రెండు గంటల పాటు శ్రమించి వర్షం నీటిని దారి మళ్లించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

• రహదారులపై మురుగునీరు

పేట్‌బషీరాబాద్: గురువారం కురిసిన వర్షానికి రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోయింది. వర్షంనీరు నిలవడంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ప్రసన్ననగర్, వెన్నెలగడ్డ ప్రభుత్వ పాఠశాలకు వాజ్‌పేయ్ నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్‌లు క్లీన్ చేయకపోవడంతోనే వర్షం వచ్చినప్పుడల్లా ప్రసన్ననగర్ ఇళ్ల మధ్యన మురుగునీరు చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై ఇసుక, కంకర పోసి విక్రయించుతుండడంతోనే వర్షపు నీరు బయటకు పోక రహదారిపైనే నిలుస్తుంది.


షాపూర్‌నగర్ హెచ్ఏఎల్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు


ఓల్డుబోయినపల్లి శివ ఎన్‌క్లేవ్ వద్ద వర్షం నీటిని దారిమళ్లిస్తున్న సిబ్బంది

• పొంగుతున్న మ్యాన్‌హోల్

షాపూర్‌నగర్: సూరారం డివిజన్‌లోని పలుకాలనీలు, బస్తీల్లో మ్యాన్‌హోల్స్ పొంగి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. సంజీవగాంధీనగర్, న్యూ షాపూర్‌నగర్, కళావతినగర్, జయశంకర్ కాలనీలతో పాటు గాజులరామారం డివిజన్‌లోని హెచ్ఏఎల్ కాలనీలో పొంగుతున్న మ్యాన్ హోల్స్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారు.


కూకట్‌పల్లి వివేకానందనగర్‌కాలనీలోని అనుపమ ఆస్పత్రి వెనుక రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపునీరు

• రోడ్లపై భారీగా నిలిచిన వర్షపు నీరు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారులు పెద్దఎత్తున వర్షపునీరు నిలిచింది. దీంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. జీహెచ్ఎంసీ సిబ్బంది వర్షపునీరు నిలిచిన ప్రాంతాలపై దృష్టి సారించకపోవడంతో శుక్రవారం కూడా కాలనీల్లోని రోడ్లపై పెద్దఎత్తున వర్షపునీరు నిల్వ ఉంది. కూకట్‌పల్లి, వివేకానందనగర్‌కాలనీ, మూసాపేట, బాలాజీనగర్ ప్రాంతాల్లో వర్షపునీటి నిల్వ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో స్థానిక ప్రజలు అవస్థలు ఎదుర్కొవాల్సి వచ్చింది.


వెన్నెలగడ్డ వెళ్లే దారిలో ..


ప్రసన్ననగర్‌లో..

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

కుత్బుల్లాపూర్: సర్కిల్ పరిధిలో జలమయమైన పలు రోడ్లు, లోతట్టు ప్రాంతాలను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, అధికారులు శుక్రవారం పరిశీలించారు. సుచిత్రా నుంచి అల్వాల్ ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షం నీటిని జెడ్సీ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని సర్కిల్ ఉప కమిషనర్ వి.నర్సింహకు సూచించారు. చింతల్ ప్రధాన రహదారిలోని రిడ్జ్ టవర్స్ వద్ద నిలిచిన వర్షం నీటిని ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ కృష్ణచైతన్య, పట్టణ ప్రణాళికా ఏసీపీ సాయిబాబా, డీఈఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి పరిశీలించి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించారు.


వర్షపునీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలిస్తున్న జెడ్సీ, అధికారులు

శేరిలింగంపల్లిలో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

గచ్చిబౌలి: గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రోస్, జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. వరద ముంపు ప్రాంతాలను గుర్తించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించారు. రోడ్లపై నీరు నిలవకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.


సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తున్న రొనాల్డ్‌రోస్, అధికారులు

కాంగ్రెస్ పార్టీ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడండి

షాపూర్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్, సంజయ్‌గాంధీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై జీహెచ్ఎంసీ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివిజన్ సీనియర్ నాయకులు గొల్ల జాన్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. అయితే గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో మళ్లీ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, జ్యోత్స్న శివారెడ్డి, పున్నారెడ్డి, కెఎం.ప్రతాప్, కూన శ్రీశైలంగౌడ్, వీరితోపాటు జీహెచ్ఎంసీ ప్రిన్సిపల్ సెక్రటరీ, బాలానగర్ ఏసీపీలకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు రెహ్మతుల్లా, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కేఎం ప్రతాప్‌కు వినతిపత్రం ఇస్తున్న గొల్ల జాన్

మాలమహానాడు ప్రధాన కార్యదర్శిగా సతీష్‌కుమార్

భెల్‌కాలనీ, మే17 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ సీనియర్ కార్మిక నాయకుడు, కమ్యూనిటీ సెంటర్ మాజీ సాహిత్య కార్యదర్శి సతీష్‌కుమార్ తెలంగాణ మాలమహానాడు ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం నియమితులైయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సిమయ్య నుంచి నియామకపత్రాన్ని అందుకున్నాడు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా భెల్ కార్మికులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్ర మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న సతీష్‌కుమార్


సప్తగిరికాలనీలోని తన నివాసంలో నాయకులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

కాసాని గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి

వివేకానందనగర్‌కాలనీ, మే 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేశారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అభినందించారు. సప్తగిరి కాలనీలోని తన నివాసంలో శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లకు చెందిన ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయడంతో పాటు పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు శక్తివంచనలేకుండా నాయకులు, కార్యకర్తలు పని చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కాలనీల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారాని కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మంజుల, స్వప్న, బీబీ, సరస్వతి, భారతమ్మ, చంద్రకళ, రమేష్ పటేల్, కరీం, పూర్ణ, అహ్మద్, హర్షద్, జాఫర్, చారి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): శాంతినగర్, బాలాకృష్ణనగర్, సంగీతనగర్, సప్తగిరికాలనీ, శివాలయం ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య తెలిపారు. వివేకానందనగర్‌కాలనీలోని కాంప్లెక్స్ రోడ్డులో ఉదయం 6:30 గంటల నుంచి 7 వరకు, వివేకానందనగర్‌లోని ప్లాట్ నెంబర్ 863 ప్రాంతంలో ఉదయం 7 నుంచి 7:30 గంటల వరకు, సంగీతనగర్, దయార్‌గూడ ప్రాంతాల్లో ఉదయం 7:30 గంటల నుంచి 8 వరకు, వివేకానందనగర్‌కాలనీలోని వడ్డేపల్లి నివాసప్రాంతంలో 8 నుంచి 8:30 గంటల వరకు, కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం రోడ్డులో 8:30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

• గాజులరామారంలో..

గాజులరామారం ఉషాముళ్లపూడి సబ్-స్టేషన్‌లోని మెట్కాన్‌గూడ ఫీడర్ మర్మతులు కారణంగా నేడు ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు శ్రీవెన్ఎన్‌క్లేవ్, ఓక్షితాఎన్‌క్లేవ్, వీనస్ఎన్‌క్లేవ్, దేవభూమినగర్, ఆదర్శనగర్, మెట్కాన్‌గూడ,పెద్దమ్మనగర్, కృష్ణ మహాలక్ష్మీనగర్, శారదానగర్, చిత్తారమ్మ దేవాలయం, సోమిరెడ్డి వెంచర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు.

• రాయదుర్గంలో..

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు బాపూనగర్, ఆదర్శ్‌నగర్, ఓల్డ్‌ముంబాయి హైవే, డోయన్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్నేహితులతో భవనంపై సెల్ఫీ తీసుకుంటూ

• కిందపడిన యువకుడికి గాయాలు

చాంద్రాయణగుట్ట, మే 17(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగుతుండగా భవనంపై నుంచి కిందపడిన యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉప్పుగూడ క్రాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ప్రాంతానికి చెందిన భాగ్య కుమారుడు నాని(16)శుక్రవారం ఉప్పుగూడ క్రాంతినగర్‌లో వాంబే క్వార్టర్స్‌కి వెళ్లాడు. తన స్నేహితులు అదే క్వార్టర్స్ రెండో అంతస్తులో నివసిస్తారు. అక్కడికి వెళ్లి వారితో సెల్‌ఫోన్‌లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భవనానికి అనుకోని ఉన్న విద్యుత్ కేబుల్‌పై పడడంతో విద్యుత్ స్తంభం విరిగి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు

రెండు నెలలుగా అందని వేతనాలు

జీతాలు ఇప్పించాలని కోదండరాంకు బస్తీ దవాఖానా ఉద్యోగుల వినతి

ఓల్డుబోయినపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.. ఎలాగైన సీఎంకి తమ పరిస్థితి వివరించి వేతనాలు అందేలా చూడాలని బస్తీ దవాఖానా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు టీజేఎస్ అధినేత కోదండరాంకు మొరపెట్టుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో జనరల్ సెక్రెటరీ అంజద్ అలీఖాన్, కమిటీ సభ్యులతో కలిసి కోదండరాం నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేసి తమ కష్టాలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 56 బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, సపోర్టింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు అందలేదని దీంతో ఇంటి అద్దెలు, నిత్యావసర సరుకులు కొనుక్కునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సపోర్టింగ్ స్టాఫ్‌కు ఇచ్చే వేతనాలు సరిపోవడం లేదని ఆ విషయంపై ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా చూడాలని కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కన్వీనర్ ఉప్పలయ్య, కోశాధికారి శాంతమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు స్వప్న పాల్గొన్నారు.


కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న సుమన్, సభ్యులు

సుభాష్‌నగర్ డివిజన్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా సుభాష్‌నగర్ ఫాక్స్‌సాగర్ సమీపంలో చెత్తాచెదారాలు కుప్పలుగా పోసి ఉండటంతో స్థానికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుభాష్‌నగర్ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై చ ర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ఫాక్స్‌సాగర్ కట్ట వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

భెల్‌కాలనీ, మే17 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం వీరబ్రహ్మేంద్రస్వామికి సహస్రనామార్చన, దంపతులచే గాయత్రీ హోమం, శాంతియజ్ఞం నిర్వహించారు. కామాక్షి అమ్మవారి ఆలయంలో సామూహిక లలితపారాయణం, మహానివేదన చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యదర్శి మాయబ్రహ్మం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భెల్ అధికారులు, కార్మికులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బాలానగర్ మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఎన్నిక


జనరల్ బాడీ మీటింగ్‌లో మాట్లాడుతున్న అంబటి సునీల్‌కుమార్‌గుప్తా

బాలానగర్, మే 17(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మైక్రో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక సాయినగర్ సాయినాగేంద్ర ఆలయం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొని నూతన కమిటీ నియామకంపై చర్చించి మెజారిటీ సభ్యుల నిర్ణయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అంబటి సునీల్‌కుమార్ గుప్తా, జనరల్ సెక్రటరీగా బీటీవీ బాలాజీ, కోశాధికారిగా భాస్కర్‌రావును ఎన్నుకున్నారు. వీరితో పాటు ఈసీ మెంబర్లుగా రాధాకృష్ణ, సత్యనారాయణ, రత్నం, బత్తుల శ్రీనివాస్, మోతీలాల్, అమరేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనను మరోసారి (ఇది నాలుగోసారి) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వారం రోజుల్లో పూర్తి కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు.

విశ్వసేవారత్న బిరుదు ప్రదానం

భెల్‌కాలనీ, మే17 (ఆంధ్రజ్యోతి): కృష్ణమూర్తిచారి ఫౌండేషన్ ద్వారా చేపట్టిన వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ- విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల ప్రజ్ఞ గౌరవ బిరుదును బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ కాలనీకి చెందిన కే.కృష్ణమూర్తి అందుకున్నారు. ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగ్ల పపింణీ, పాఠశాలలో తాగునీటి సౌకర్యం కలించడంతో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పనులను చేపట్టగా, సేవలను గుర్తించిన సంఘం బిరుదును ప్రదాన చేసింది. తెలంగాణ రాష్ట మాజీ స్పీకర్ మధుసూదనాచారి, విశ్వజ్యోతిర్లింగ పీఠాధిపతి రామడుగు నరసింహాచార్యుల చేతుల మీదుగా విశ్వసేవారత్న అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ చారి, కమిటీ సభ్యులు చోలేటి కృష్ణమాచారి, రాగి ఫణి రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.


బిరుదు అందుకుంటున్న కృష్ణమూర్తిచారి


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఘనంగా మహాలక్ష్మీ హోమం

భెల్‌కాలనీ, మే17 (ఆంధ్రజ్యోతి): మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన శ్రీనివాసుని కల్యాణం అంబరాన్నంటింది. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేషపూజలు చేశారు. శుక్రవారం నిత్యహోమం, శ్రీమహాలక్ష్మీ హోమం నిర్వహించారు. సహస్రనామ సంపుటీకరణ హోమం, మహాలక్ష్మీ అమ్మవారికి- గోదాదేవి ఆలయాల్లో 108 కేజీల కుంకుమ, పసుసుతో ప్రత్యేక కుంకుమార్చనను నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణతో ఏర్పాటు చేసిన మండపంపై సతీసమేతుడైన శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి అంగరంగవైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు.


అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న కుత్బుల్లాపూర్ పట్టణ ప్రణాళికా అధికారులు

అక్రమంగా నిర్మించిన షెడ్ల కూల్చివేత

కుత్బుల్లాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు, షెడ్లు నిర్మిస్తే ఉపేక్షించేది లేదని, అక్రమ నిర్మాణాలని తేలితే తక్షణమే కూల్చివేతలు చేపడతామని కుత్బుల్లాపూర్ పట్టణ ప్రణాళికా ఏసీపీ సాయిబాబా తెలిపారు. సర్కిల్ పరిధిలో చేపడుతున్న పలు అక్రమ నిర్మాణాలు, షెడ్లపై అందిన ఫిర్యాదుల మేరకు ఆయన సిబ్బందితో కలిసి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలను శుక్రవారం కూలివేశారు. అక్రమ నిర్మాణాల గురించి తమ దృష్టికి తీసుకువస్తే నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న సురేష్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి

జీడిమెట్ల: ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి అన్నారు. డీపీకాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి, రంగస్వామి, విజయ్‌కుమార్, పృథ్వీ, శంకర్‌శాస్త్రి పాల్గొన్నారు.